నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు



ఆధార్ కేంద్రం వద్ద వినియోగదారుల రద్దీ (ఫైల్)

- గ్రామ, వార్డు సచివాలయాల్లో 4 రోజుల పాటు నిర్వహణ
- పదేళ్ల వ్యవధిలో ఒక్కసారైనా ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలి
- ప్రత్యేక క్యాంపులో కొత్త ఆధార్ నమోదు, మార్పులు, చేర్పుల సేవలు

ఇప్పుడు ఏ పని జరగాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా, ఉద్యోగాలు దక్కించుకోవాలన్నా, కళాశాలల్లో చేరాలన్నా, బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలన్నా.. ఒకటేమిటి సమస్త కార్యకలాపాలకు ఆధార్ కార్డు ఉండాల్సిందే. అది కూడా అప్‌డేటెడ్‌గా ఉండాలి. అయితే చాలా మంది ఆధార్ కార్డు ఎప్పుడో పొందినా తర్వాత దాని గురించి పట్టించుకోరు. అలాగే పొరపాట్లు, సవరణలు, మార్పులు చేయించుకోరు. దీని వల్ల అత్యవసర సమయాల్లో ఇబ్బందులు తప్పవు. ఇలాంటి వాటిని నిరోధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తోంది. ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకుని ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్తగా ఆధార్‌కు దరఖాస్తు వంటివి చేసుకోవచ్చు.

డాబాగార్డెన్స్ : గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 22 నుంచి నాలుగు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఆధార్ కీలకంగా మారిన నేపథ్యంలో ఆధార్‌లో తప్పుల కారణంగా అర్హులెవరూ ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఈ నెల 22 నుంచి 25 వరకు ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. నియోజకవర్గాల వారీగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ క్యాంపులు ఉంటాయి. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు జారీ చేశారు.

కనీసం పదేళ్లకోసారైనా..

ప్రతి ఒక్కరూ కనీసం పదేళ్ల వ్యవధిలో ఒక్కసారైనా తమ ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐ కొత్తగా నిబంధనలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆధార్ అనుసంధానంతో కూడిన కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే వివరాలను తాజాగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. గత పదేళ్లలో ఒక్కసారి కూడా తమ వివరాలు అప్‌డేట్ చేసుకోని వారు నియోజకవర్గ పరిధిలో అనేక మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో వీరితో పాటు కొత్తగా ఆధార్ నమోదు, ఇతర మార్పులు, చేర్పుల సేవలు అందజేసేందుకు ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. ఎక్కువ మంది క్యాంపులను వినియోగించుకుని ఆధార్ సేవలు పొందేలా చూడనున్నారు. నియోజకవర్గ పరిధి 14 వార్డుల్లో గల అన్ని సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు జరగనున్నాయి.



వార్డు సచివాలయం

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారం ఐదో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె.శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు రేపు



ప్రతిభా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 23న అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ద్వితీయ భాషా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణలో పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ కౌశలం, ప్రతిభా పాటవాలను ప్రోత్సహించే ఉద్దేశంతో రెండేళ్లుగా ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విశాఖలోని అనేక డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. వక్తృత్వం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, కథలు తదితర విభాగాల్లో తెలుగు, హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందిస్తామన్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్, కోటేశ్వరరావు, గౌరీనాయుడు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

మహారాణిపేట : సమస్యల పరిష్కారం కోరుతూ దివ్యాంగులు సోమవారం స్పందన కార్యక్రమానికి తరలివచ్చారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎస్‌పీఆర్‌డీ) జిల్లా కమిటీ, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. 11 డిమాండ్ల సాధనకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించి అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. దివ్యాంగుల పింఛను మొత్తాన్ని రూ. 6 వేలకు పెంచాలని, యూడీఐడీ కార్డుల అందజేతను వేగవంతం చేయాలని, అర్హులందరికీ మోటారు వాహనాలు అందజేయాలని, అంత్యోదయ కార్డుల మంజూరు, వికలాంగుల వివాహ ప్రోత్సాహకాల పునరుద్ధరణ తదితర డిమాండ్లు పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు పాల వెంకయ్య తెలిపారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పండూరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం పాఠశాలను దత్తత తీసుకున్న కార్పొరేటర్ సాధిక్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

జగదాంబ : ఆర్‌సీఎం బాలికల పాఠశాలను జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ 38, 39 వార్డుల మధ్యలో ఉన్న ఈ ఎయిడెడ్ పాఠశాలలో సుమారు వెయ్యి మందికి పైగా పిల్లలు చదివేవారని అన్నారు. అయితే ఇప్పుడు 200 మంది మాత్రమే చదువుకుంటున్నారన్నారు. అలాగే తెలుగు భాష మాత్రమే బోధించడంతో విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల వైపు తరలిపోతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చానన్నారు. ఓల్డ్ టౌన్ డెవలప్‌మెంట్ కమిటీ ద్వారా పాఠశాల నిర్వహణ, అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా రేపు

కంచరపాలెం: కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 23న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒన్ కమ్యూనికేషన్ లిమిటెడ్ (పేటీఎం) కంపెనీలో 199 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ (టెన్త్), ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత, 18-35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.21,000 నుంచి రూ.25,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. బుధవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

అభాగ్యుడికి ఆశ్రయం



మెంటల్ కేర్ ఆస్పత్రి నుంచి శివను తరలిస్తున్న మమత

అల్లిపురం : మతిస్థిమితం లేకుండా ఉన్న శివ అనే వ్యక్తిని చినవాల్తేరులోని మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించడంతో అతనికి చికిత్స అందజేశారు. చికిత్స అనంతరం అతని ఆరోగ్యం మెరుగుపడింది. అయినా అతనిని తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులెవరూ రాకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమతకు తెలియజేయడంతో ఆమె అతనికి ఎన్‌ఏడీ జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు.

నిరాశ్రయ వసతి గృహంలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న నిరాశ్రయులు

అల్లిపురం : భీమ్‌నగర్, ఏయూటీడీ వసతి గృహంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 83 మంది నిరాశ్రయులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మరిన్ని పరీక్షలు నిర్వహించేందుకు ఆస్పత్రికి తరలించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



వేళంగిణిరావు కుటుంబ సభ్యులకు నగదు, చెక్కు అందిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం మాన్యువల్ స్ట్రీట్‌లో నివాసముంటున్న గొలగాని వేళంగిణిరావు (46) మరణించారు. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ సోమవారం సొంత నిధుల నుంచి రూ. 5 వేలు, వైఎస్సార్ బీమా ద్వారా దహన ఖర్చుల నిమిత్తం కార్పొరేటర్ పూర్ణిమ చేతుల మీదుగా రూ.10 వేల చెక్కు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా త్వరితగతిన అందేటట్లు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పూర్ణిమ వారికి తెలిపారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు వేళంగిణిరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్‌గా కొణతాల



నియామకపత్రం అందుకుంటున్న కొణతాల శ్రీనివాస్

దాబాగార్డెన్స్ : పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి రాకేష్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా లీగల్ సెల్ చైర్మన్‌గా కొణతాల వెంకట శ్రీనివాస్ నియమితులయ్యారు. సోమవారం విజయవాడ ఆంధ్ర రత్న భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్టేట్ లీగల్ సెల్ చైర్మన్ వి. గురునాథరావు కొణతాలకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాలుష్య నియంత్రణకు సహకరించండి

మేయర్ హరి వెంకటకుమారి



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి చేరుకుంటున్న మేయర్



తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్ : కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తన సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బంది వినియోగించేలా చూడాలన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలన్నారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్ : ప్రముఖ చలన చిత్ర కథానాయకులు చిరంజీవి, బాలకృష్ణ నటించిన పలు చిత్రాల గీతాలతో సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. స్వర గీతిక సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కళారంగ ప్రముఖులు భయ్యా శ్రీనివాస్, సన్‌మూర్తి, సంస్థ వ్యవస్థాపకుడు రాజారావు, శ్యాంసుందర్ ప్రారంభించారు. లోకేష్ ట్రాక్స్ సహకారం అందివ్వగా, లక్ష్మీ స్వరూప వ్యాఖ్యానం చేశారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు మహదేవ మూర్తి, బొమ్మిడి సత్యనారాయణ, కేవీఎల్ రావు, వేణుగోపాల్, వీవీఎస్ మూర్తి, జిలాని, శ్యాంసుందర్, రామ్ కుమార్, మాధవ్, వెంకటేష్, అభినయ్, మాధురి, లక్ష్మీ సాత్విక, గౌరీ, సుజాత, లాయర్ శ్రీదేవి, లక్ష్మీ స్వరూప తదితరులు గీతాలాపన చేశారు.

మహిళా కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్



కార్యక్రమంలో విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి

డాబాగార్డెన్స్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థినులకు సోమవారం స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి నిర్వహించారు. కళాశాల ఆవరణ, మౌలిక సదుపాయాలు, సంస్కృతిని ఈ సందర్భంగా పరిచయం చేశారు. ఈ కార్యక్రమం సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడానికి సహాయం చేస్తుందని ప్రిన్సిపాల్ వివరించారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా అధ్యాపకుల ద్వారా ఫ్రెషర్స్‌కు స్వాగతం పలకడం, విద్యార్థినులకు సంబంధిత సిబ్బందితో పరిచయ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంస్థ దృక్పథం, సంస్థాగత విధానాలు, విలువలతో కూడిన విద్య గురించి తెలిపారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ నేతృత్వంలో ఎన్ఈపీ, సీబీసీఎస్ నిర్మాణం, సింగిల్ మేజర్ సిస్టమ్‌లోని పాఠ్యాంశాలు, మూల్యాంకన విధానాల గురించి వివరించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి సంతోషి అనూష విద్యార్థులకు ప్రవర్తనా నియమావళి గురించి తెలపగా, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి, లైబ్రేరియన్ డాక్టర్ ఎ. ధరణి కళాశాల ఆవరణలో గల వివిధ విభాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమం 21 రోజుల పాటు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఓటరు నమోదుపై టీడీపీ సమీక్ష

మహారాణిపేట: ఓటరు నమోదు, హౌస్ మ్యాపింగ్‌పై తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం ఇన్‌చార్జి కూన రవికుమార్ సోమవారం పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పీవీజీఆర్ నాయుడు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వి.చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నివారణ



వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ : వారంలో ఒకరోజు డ్రై డే పాటించి దోమల నిర్మూలనకు కృషి చేద్దామని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. సోమవారం వార్డులో వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో సత్యనారాయణ మాట్లాడుతూ డ్రై డే పాటించడం వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి ప్రమాదకర వ్యాధులను నిరోధించవచ్చన్నారు. ఇళ్లలో ఉన్న నీటి కుండీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. లేదా వస్త్రం చుట్టి పెట్టుకోవాలన్నారు. దీని వలన దోమలు లార్వాలు పెట్టకుండా ఉంటాయన్నారు. అలాగే ఫ్రిజ్‌ల వెనుక ఉన్న నీటిని కూడా శుభ్రం చేసుకోవాలన్నారు. పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరిబొండాలు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా, పారిశుధ్య విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

‘టైం’ బాలేదు

- కనుమరుగవుతున్న వాచ్ మెకానిక్‌లు
- దెబ్బకొట్టిన డిజిటల్ వాచ్‌లు



వాచ్ రిపేరు చేస్తున్న మెకానిక్

ఒకప్పుడు వివాహాల్లో పెళ్లి కొడుక్కి వాచ్ పెడితే గొప్పగా చెప్పుకునేవారు. అప్పట్లో వాచ్‌లకు అంత క్రేజ్ ఉండేది. ఆ రోజుల్లో కీ వాచ్‌లు ఎక్కువగా వాడేవారు. హెచ్ఎంటీ, రేడియో, సోనీ వంటి ఇంపోర్టెడ్ వాచీలు అంటే ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. అవి సర్వసాధారణంగా రిపేర్‌కు వచ్చేవి కాదు. ఒక వేళ వస్తే వాటికి ఆయిలింగ్, సర్వీసింగ్ చేయించుకునేవారు. అందుకోసం ప్రత్యేకంగా తర్ఫీదు పొందిన వాచ్ మెకానిక్‌లు ఉండేవారు. వాచ్ అంటే హస్తాభరణంగా భావించేవారు. ప్రస్తుత రోజుల్లో ఆ వాచీలు కనుమరుగవడంతో వాచ్ మెకానిక్‌లు కూడా ఉపాధి కోల్పోయారు.

అల్లిపురం : ఒకప్పుడు ఏ ప్రాంతంలో చూసినా కనిపించిన వాచ్ మెకానిక్‌లు ఇప్పుడు ఎక్కడో తప్ప కనిపించడంలేదు. వారికి వాచ్ రిపేర్ పని పెద్దగా లేకపోవడమే దీనికి కారణమని చెప్పొచ్చు. అరకొర వాచీలు వస్తే వాటిని రిపేరు చేసుకుంటున్నారు. వాటిపైన వచ్చే ఆదాయం వారి దుకాణాల అద్దెలకు కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. తమకు ప్రత్యామ్నాయం లేక తప్పనిసరి పరిస్థితుల్లో అదే పని చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బ కొట్టిన ఎలక్ట్రానిక్, డిజిటల్ వాచ్‌లు..

గతంలో జిల్లా మొత్తం 250 పై చిలుకు వాచ్ మెకానిక్‌లు ఉండే వారు. ఇప్పుడు ఆ సంఖ్య 50కి చేరుకుందని వాచ్ మెకానిక్‌లు చెబుతున్నారు. వారికి కూడా ఎప్పుడో పని దొరుకుతుందని పేర్కొంటున్నారు. మెకానికల్ వాచ్‌లు పోయి ఎలక్ట్రానిక్ వాచీలు వచ్చాయి. వాటిని రిపేరు చేయడం కూడా లేదు. కావాలంటే మిషన్ మార్చేస్తున్నారు. వాటి స్థానంలో ఇప్పుడు డిజిటల్ వాచీలు వచ్చాయి. అవి వేలల్లో ఉన్నా వాటిని రిపేరు చేసే పరిజ్ఞానం తమ వద్ద లేదని వాపోతున్నారు. గతంలో వందల్లో ఉండే దుకాణాల అద్దెలు ఇప్పుడు వేలల్లో ఉండటంతో అద్దెలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకి రూ.500 కూడా రావటం లేదని వాపోతున్నారు. ఈ వృత్తి తప్ప మరో వృత్తి రాకపోవటంతో ఓపిక ఉన్నంత వరకు ఇదే వృత్తిలో కొనసాగక తప్పదని చెబుతున్నారు.

కష్టపడినా ఆదాయం లేదు..



నాకు వాచ్ రిపేర్ పని తప్ప మరో పని చేతకాదు. రోజుకి రూ.500కు మించి ఆదాయం రాదు. అందులోనే కరెంట్, అద్దె, ఇతర ఖర్చులు చూసుకోవాలి. డిజిటల్ వాచ్‌లు వచ్చిన తర్వాత మా పరిస్థితి మరీ దారుణంగా మారిపోయింది. ఉన్నవారైతే వ్యాపారం మార్చుకుంటున్నారు. మాలాంటి వారు చిన్న బాక్సు ఏర్పాటు చేసుకుని వాచీలు రిపేరుకి వస్తే చేసుకుంటున్నాము. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. మా సంక్షేమం కోసం కృషి చేయాలి.

– టి.పుల్లారావు, మాస్టర్ వాచ్ సెంటర్

వేడుకగా కనకమ్మ తొలేళ్ల సంబరం



ప్రత్యేక అలంకరణలో అమ్మ వారు



తొలేళ్ల సంబరాల్లో డప్పు వాయిద్యాల సందడి

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలో కనకమ్మ వారి తొలేళ్ల సంబరాలను సోమవారం కనులపండువగా నిర్వహించారు. గ్రామ సేవా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. హెచ్‌బీ కాలనీలో హౌసింగ్ బోర్డు కార్యాలయం వద్ద గల శతకం పట్టు నుంచి పుట్టమన్నును తీసుకుని శ్రీ సీతారామాలయం వరకు ముమ్మారు ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పు వాయిద్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మంగళవారం జరిగే జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి తెలుగు భాషా వారోత్సవాలు

ఏయూ క్యాంపస్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి తెలుగు భాషా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు తెలిపారు. ఆగస్టు 29న కళాప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని బుధవారం నుంచి 29 వరకు రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వివిధ మేధోపోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 23న వ్యాసరచన పోటీలు, 24న వక్తృత్వ పోటీలు, 25న పద్యపఠనం, 26న తెలుగు భాషా సాహిత్యాలపై క్విజ్, 27న నిష్ణాతులైన భాషా సాహిత్యవేత్తలతో చర్చా గోష్ఠి, 28న సోమవారం గిడుగు రామమూర్తి రచనలపై ఉపన్యాసాలు, 29న ముగింపు కార్యక్రమం ఉంటాయని తెలియజేశారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విశిష్ట అతిథులుగా ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్ బాబు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ డి.వి సూర్యారావు, పరవస్తు ఫణిశయనసూరి హాజరవుతారని వివరించారు.